క్లుప్తంగా

నేడు అదీప్‌రాజ్ ఎన్నికల ప్రచారం

సబ్బవరం: మండలంలోని అమృతపురం,తవ్వవానిపాలెం గ్రామాల్లో బుధవారం వైఎస్సార్‌సీపీ అభ్యర్థి అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారని ఆ పార్టీ మండల కన్వీనర్ కర్రిబాబు తెలిపారు.సాయంత్రం 5 గంటలకు ప్రచారం ప్రారంభమవుతుందని పార్టీ నాయకులు,ప్రజా ప్రతినిధులు పాల్గొవాలని పిలుపునిచ్చారు.

13 మందికి కొలువులు



ఎంపికైన విద్యార్థులతో విస్తం ప్రతినిధులు

పెందుర్తి: పినగాడి సమీపంలోని విస్తం ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 13 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. టీపీవో డిజిటల్ కంపెనీలో 13 మంది ఇంజనీరింగ్ విద్యార్థులకు కొలువులు లభించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ బి.వి శివకుమార్ తెలిపారు. ఎంపికై న విద్యార్థులకు ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో కళాశాల ప్లేస్‌మెంట్ అధికారులు ఇ.కిరణ్‌కుమార్, ఎం.వి.జె.టి అరుణ్, కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యస్వామికి విశేష పూజలు



పూజలందుకున్న సుబ్రహ్మణ్యస్వామి

సింహాచలం: అడవివరం దరి విజినిగిరిపాలెంలోని ఉమా చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో కొలువుదీరిన వల్లీ దేవ సుబ్రహ్మణ్యస్వామికి మంగళవారం విశేష పూజలు జరిగాయి. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు భక్తులు తరలివచ్చి స్వామికి అభిషేకాలు నిర్వహించారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్‌కృష్ణశర్మ ఈ పూజలు నిర్వహించారు.

10 మద్యం సీసాల స్వాధీనం

పరవాడ: తాడి గ్రామానికి చెందిన పీత అప్పలరాజు వైన్ షాపు నుంచి 10 మద్యం సీసాలు అక్రమంగా తరలిస్తుండగా ఎస్ఐ టి.మల్లేశ్వరరావు అతని నుంచి స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. ఎవరు మద్యం సీసాలు తరలించినా చర్యలు తప్పవని సీఐ ఎస్.బాలసూర్యారావు చెప్పారు.

2వ తేదీ వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సింహాచలం: అడవివరంలో బీఆర్‌టీఎస్ రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా విద్యుత్ లైన్లు మార్చనున్న దృష్ట్యా ఈ నెల 2వతేదీ వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఈపీడీసీఎల్ ఈఈ పి.శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. కుమ్మరిదిబ్బ, విజినిగిరిపాలెం, పుష్కరిణి తదితర ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 4గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు కృషి చేయాలి



మాట్లాడుతున్న నరవ ప్రకాశరావు

ఆరిలోవ: బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు అందరూ సమష్టిగా కృషి చేయాలని బాల వికాస్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు నరవ ప్రకాశరావు కోరారు. జాతీయ బాల కార్మిక వ్యవస్థ వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ బాలికల వసతి గృహంలో మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోవిడ్ తర్వాత బాల కార్మికుల సంఖ్య పెరిగిందన్నారు. బాలలను కార్మికులుగా మార్చకుండా చదివించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. విద్యా హక్కు చట్టం పూర్తి స్థాయిలో అమలు జరిగినప్పుడే బాల కార్మికులు సంఖ్య తగ్గుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గృహం పర్యవేక్షణాధికారి ఎ.వి.సునీత, సిబ్బంది, ఫౌండేషన్ సభ్యులు చాట్ల బాబూరావు రెడ్డి, హుస్సేన్ పాల్గొన్నారు.

సంక్షేమాన్ని చూసి ఓటు వేయండి

- జగన్ చెప్పారంటే. చేస్తారు
- ప్రతిపక్షాల మోసపూరిత హామీలు నమ్మవద్దు
- వైఎస్సార్‌సీపీ అభ్యర్థి అన్నంరెడ్డి అదీప్‌రాజ్



సంక్షేమ పథకాలను వివరించి ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలని కోరుతున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్



జీవీఎంసీ 97వ వార్డు గణేష్‌నగర్‌లో అదీప్‌రాజ్‌పై పూలవర్షం కురిపిస్తున్న స్థానికులు

పెందుర్తి: 'అమలు సాధ్యమైన హామీలు మాత్రమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇస్తారు. మా పాలనలో మేలు జరిగితేనే ఓటు వేయండని మేం అడుతున్నాం. మా నాయకుడికి మోసాలు తెలియవు..ప్రజలను మభ్యపెట్టడం తెలియదు..సాధ్యమైన..అమలు చేయగలిగిన హామీలతో మాత్రమే సీఎం వైఎస్ జగన్ మేనిఫెస్టో విడుదల చేశారు అని వైఎస్సార్‌సీపీ పెందుర్తి ఎమ్మెల్యే అభ్యర్థి అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు. కానీ చంద్రబాబు మోసపూరిత హామీలతో ప్రజలను మభ్య పెట్టడానికి సిద్ధమయ్యారని అదీప్‌రాజ్ మండిపడ్డారు. జీవీఎంసీ 97వ వార్డు గణేష్‌నగర్‌లో మంగళవారం అదీప్‌రాజ్ విస్తృత ప్రచారం చేశారు. ఇంటింటికీ వెళ్లి ఫ్యాన్ గుర్తుపై ఓటేసి తనతో పాటు ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాల నాయుడును అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2014లో సుమారు 600 హామీలతో ప్రజలను మోసం చేసిన చంద్రబాబును చూసి ఈసారి బీజేపీ భయపడిందన్నారు. అందుకే మేనిఫెస్టోలో బీజేపీ గుర్తు గానీ, ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఫొటో వేయడానికి ఒప్పుకోలేదన్నారు. చంద్రబాబు ఇచ్చిన హామీలు అమలు సాధ్యం కాదని బీజేపీ గుర్తించి ఆ హామీలకు తాము గ్యారంటీ ఇవ్వలేమని బీజేపీ ప్రకటించడంతో బాబు నిబద్ధత తేటతెల్లమైందన్నారు. పొత్తు కుదుర్చుకున్న మిత్ర పక్షమే చంద్రబాబు హామీలను నమ్మడం లేదు...అలాంటి మోసపు చరిత్ర ఉన్న చంద్రబాబును మీరు నమ్ముతారా అని అదీప్‌రాజ్ అన్నారు. కష్టకాలంలో అన్ని విధాలా అండగా ఉన్న సీఎం వైఎస్ జగన్‌కు మద్దతుగా నిలవాలని' అని అదీప్‌రాజ్ కోరారు. కార్యక్రమంలో వార్డు ఇన్‌చార్జి మెంటి మహేష్, సీనియర్ నాయకుడు ముచ్చకర్ల దారప్ప, ముమ్మన మహాలక్ష్మినాయుడు, గంగరాజు, భాస్కర్, ముమ్మన సూరిబాబు, చిక్కాల సతీష్, రాపర్తి ప్రసాద్, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆదరించండి



ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అదీప్‌రాజ్

పెందుర్తి మండలం చింతగట్లలో ఉపాధి హామీ కూలీలతో ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ మంగళవారం భేటీ అయ్యారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పని సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఏ సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని చెప్పారు. సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా బూడి ముత్యాలనాయుడును గెలిపించాలని కోరారు. ఆయన వెంట రాష్ట్ర అయ్యారక కార్పొరేషన్ డైరెక్టర్ గనిశెట్టి కనకరాజు, ఎంపీటీసీ సభ్యుడు నందవరపు అప్పలరాజు, మాజీ ఉపసర్పంచ్ గొంప అప్పారావు, స్థానిక నాయకులు ఉన్నారు.

అన్నదాతకు భరోసా

- గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాల నిర్మాణం
- ఆర్బీకేల ద్వారా రైతులకు సేవలు



రావలమ్మపాలెం రైతు భరోసా కేంద్రం



పెందుర్తి మండలం వాలిమెరక రైతు భరోసా కేంద్రం

పెందుర్తి: అన్నం పెట్టే రైతన్నకు ప్రభుత్వం అడుగడుగునా అండగా నిలిచింది. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి అన్నదాతకు చేయూతనిందిస్తున్నారు. వ్యవసాయాన్ని పండగ చేస్తానని గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం ప్రతిష్టాత్మకంగా రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఆర్బీకేల ద్వారా రైతులకు సబ్సిడీపై విత్తనాలు సమర్థవంతంగా అందిస్తున్నారు. వ్యవసాయ పనిముట్లు, ఇతర పరికరాలను రైతు సేవా కేంద్రాల ద్వారా సబ్సిడీపై పంపిణీ చేస్తున్నారు. దుక్కు నుంచి నూర్పు వరకు ప్రతీ దశలోనూ ప్రభుత్వం వెన్నుదన్నుగా నిలవడంతో పండగ వాతావరణంలో రైతులు సేద్యం చేస్తున్నారు.

సేవలన్నీ రైతు చెంతకే..

ప్రభుత్వం సీజన్‌లో పంట వేసేందుకు పెట్టుబడి సాయం మొదలుకుని పంట చేతికందిన తర్వాత రైతుకు గిట్టుబాటు ధర అందించే వరకు అన్నదాతను వెన్నంటి ప్రోత్సహిస్తుంది. వైఎస్సార్ రైతు భరోసా పథకంలో భాగంగా నియోజకవర్గంలోని సబ్బవరం, పరవాడ, పెందుర్తి మండలాల నుంచి నాలుగు విడతలకు గాను 22570 మంది రైతులకు దాదాపు రూ. 90 కోట్లు నేరుగా వారి ఖాతాల్లోనే జమ చేసింది. సబ్బవరం మండలం అమృతపురంలో పైలట్ ప్రాజెక్ట్‌గా రైతు సేవా కేంద్రం ఏర్పాటు చేసి వారికి కావాల్సిన పనిముట్లు అందిస్తుంది. రైతులందరికీ వడ్డీ లేని రుణాలు అందిస్తున్నారు. పంట బీమా ప్రీమియం మొత్తం ప్రభుత్వమే చెల్లిస్తుంది. వ్యవసాయ ట్రాక్టర్లకు రోడ్డు ట్యాక్స్ రద్దు చేసింది. వ్యవసాయానికి పగటిపూట 9 ఉచితంగా విద్యుత్ అమలు జరుగుతోంది. ఆర్బీకేల ద్వారా రైతులకు సబ్సిడీ ద్వారా విత్తనాలు, ఎరువులు సకాలంలో అందిస్తున్నారు

అను'బంధం'

నియోజవకర్గంలో మొత్తం 38(పెందుర్తి 9, పరవాడ 12, సబ్బవరం 17) రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు నేరుగా సేవలందిస్తున్నారు. ఆయా కేంద్రాల నిర్మాణానికి ప్రభుత్వం ఒక్కో భవనానికి సుమారు రూ.23.94 లక్షల(నియోజకవర్గం మొత్తం ఆర్బీకేలకు రూ.9.10 కోట్లు) చొప్పున నిధులు కేటాయించింది. వీటికి అదనంగా వ్యవసాయ అనుబంధ కమిటీలు/సంఘాలకు ప్రభుత్వం పునర్జీవం పోసింది. పదేళ్లుగా పూర్తిగా నిర్వీర్యం అయిన పీఏసీఎస్‌లకు జీవం పోసింది. త్రిసభ్య కమిటీలను ఏర్పాటు చేసింది. వ్యవసాయ మార్కెట్ కమిటీలను నియమించింది. ఆయా సంఘాల ద్వారా రైతులకు అవసరమైన సేవలు అందించేందుకు కార్యాచరణ రూపొందించి అమలు చేస్తోంది. రైతులకు మేలు చేస్తూనే అనుబంధ కమిటీల ద్వారా కూడా అన్నదాతలకు చేదోడువాదోడుగా నిలవడంపై అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తాజాగా ఎన్నికల మేనిఫెస్టోలో రైతు భరోసా పెంచనున్నట్టు సీఎం జగన్ ప్రకటించడంతో ఇక పెట్టుబడికి డోకా ఉండదని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

సిరులతల్లికి అష్టదళ పద్మారాధన

దాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో పి. శ్రీనివాసులరెడ్డి, ఏఈవోలు కె. తిరుమలేశ్వరరావు, వి. రాంబాబు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

వర్క్‌షాప్‌లతో నైపుణ్యం మెరుగు



పోస్ట్ గ్రాడ్యుయేట్లతో డాక్టర్ బుచ్చిరాజు, డాక్టర్ అశోక్‌కుమార్ తదితరులు

మహారాణిపేట : క్లినికల్ ట్రయల్స్, రీసెర్చి స్టడీస్ నిర్వహణలో ఉత్తమ పద్ధతులు అలవాటు చేసుకోవాలని ఆంధ్రా మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు అన్నారు. మంగళవారం కాలేజీలో పోస్ట్ గ్రాడ్యుయేట్ల కోసం వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ బుచ్చిరాజు మాట్లాడుతూ వర్క్‌షాప్‌ల ద్వారా శాస్త్రీయ ప్రమాణాలకు కట్టుబడి జ్ఞానం, నైపుణ్యం పెంపొందించుకోవాలన్నారు. కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్‌కుమార్ మాట్లాడుతూ వైద్య పరిజ్ఞానం పెంపొందించడంలో పోస్ట్ గ్రాడ్యుయేట్ల పాత్ర కీలకమన్నారు. ఈ కార్యక్రమంలో మైక్రోబయాలజీ విభాగానికి చెందిన డాక్టర్ జ్యోతి పద్మజ, ఫార్మకాలజీ విభాగాధిపతి డాక్టర్ డి. శ్యామల, ప్రొఫెసర్ డాక్టర్ కె. హిమబిందు, వర్క్‌షాప్ పోస్ట్ గ్రాడ్యుయేట్లు పాల్గొన్నారు.

అదీప్‌కు మద్దతుగా ఇంటింటి ప్రచారం

అగనంపూడి: పెందుర్తి ఎమ్మెల్యే అభ్యర్థి అన్నంరెడ్డి అదీప్‌రాజ్, ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాల నాయుడిని గెలిపించాలని కోరుతూ 79వ వార్డు లంకెలపాలెంలో వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి అప్పికొండ మహాలక్ష్మినాయుడు ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బీసీ కాలనీ, కరణం దొడ్డి ప్రాంతాల్లో నాయకులు, మహిళలు కరపత్రాలు పంపిణీ చేసి, వైఎస్సార్‌సీపీకి ఓటేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సుందరపు అప్పారావు, కర్రి నరసింగరావు, నెల్లి కన్నబాబు, ఎలమర్తి వెంకటరావు, కాతా నూకేష్, దాసరి ప్రకాష్, నెల్లి అప్పారావు పాల్గొన్నారు.

శేష జీవితం ఆనందమయం కావాలి



పదవీ విరమణ చేసిన ఉద్యోగులతో జీవీఎంసీ ప్రధాన వైద్యాధికారి నరేష్‌కుమార్

దాబాగార్డెన్స్ : ఉద్యోగులు పదవీ విరమణ అనంతరం శేష జీవితాన్ని ఆనందంగా గడపాలని జీవీఎంసీ ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్‌కుమార్ తెలిపారు. సంస్థ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో పదవీ విరమణ చేసిన ఆరుగురు ఉద్యోగులను సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదవీ విరమణ చేసిన ఉద్యోగుల సేవలు చిరస్మరణీయమన్నారు. కార్యక్రమంలో ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ వాసుదేవరెడ్డి, అసిస్టెంట్ ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ ఆదినారాయణ, ఏఎంవోహెచ్ కిరణ్‌కుమార్, ఏవో పద్మజ, ఏపీఎంఈఎస్ఏ కార్యవర్గ సభ్యుడు అప్పలరాజు, పర్యవేక్షకులు రియాజ్, నరసింగరావు, శ్రీనివాసరావు, సన్నితో పాటు పదవీ విరమణ చేసిన ఉద్యోగులు రామ్‌ప్రసాద్, అప్పలనాయుడు, అశోక్ కుమార్, సూరిబాబు, రామకృష్ణ, ఉమాదేవి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

'పోర్టు యాజమాన్యం కుట్రలను ఐక్యంగా తిప్పికొట్టాలి'

పెదగంట్యాడ: కార్మికులను బెదిరించేందుకు గంగవరం పోర్టు యాజమాన్యం చేస్తున్న ప్రయత్నాలను కార్మికులంతా ఐక్యంగా తిప్పి కొట్టాలని గంగవరం పోర్టు నిర్వాసిత సంఘ నాయకులు అన్నారు. తమ డిమాండ్ల సాధన కోసం 15 రోజులుగా గంగవరం పోర్టు గేటు వద్ద కార్మికులు ఆందోళన చేస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో పోర్టు యాజమాన్యం సమ్మెలో ఉన్న కార్మికులందరికీ వ్యక్తిగత నోటీసులు జారీ చేసింది. ముందస్తు సమాచారం లేకుండా సమ్మె చేయడంపై వివరణ ఇవ్వాలని ఆ నోటీసులో కోరింది. దీంతో కార్మికులంతా ఆందోళన చెందారు. అయినా, వారంతా పట్టు విడువలేదు. గురువారం కూడా కుటుంబాలతో కలసి పోర్టు గేటు వద్ద బైఠాయించారు. యాజమాన్యం తీరు మార్చుకోకపోతే భవిష్యత్తులో పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. తమకు నెలకు రూ.36వేలు వేతనాలు ఇవ్వాలని, కార్పొరేట్ ఆస్పత్రుల్లో వైద్య సదుపాయం కల్పించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో వన్ టైమ్ సెటిల్‌మెంట్ చేయాలన్నారు.

ప్రజా ఉద్యమంతో 'ఉక్కు' పరిరక్షణ



రిలే దీక్షల్లో ఉక్కు కార్మికులు, నాయకులు

అగనంపూడి: ప్రజా ఉద్యమాలతో విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకుంటామని విశాఖ ఉక్కు పరిరక్షణ కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, శ్రీనివాసరావు అన్నారు. విశాఖ ఉక్కు పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో కూర్మన్నపాలెంలో 1169వ రోజు రిలే దీక్షా శిబిరంలో వారు మాట్లాడారు. కొన్ని ప్రధాన రాజకీయ పార్టీలు విశాఖ ఉక్కు పరిరక్షణ విషయంలో సవతి ప్రేమ ఒలకబోస్తున్నాయన్నారు. కేంద్రానికి కొమ్ము కాస్తుండడం వల్లే విశాఖ ఉక్కుకు ఈ దుస్థితి కలిగిందని ఆరోపించారు. సొంత గనులు కేటాయించడం ద్వారా స్టీల్‌ప్లాంట్‌కు పూర్వ వైభవం వస్తుందని, ఈ దిశగా అన్ని రాజకీయ పార్టీలు సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రచారంలో దూకుడు



కలపాక బీసీ కాలనీలో ఎన్నికల ప్రచారం సాగిస్తున్న నాయకులు

పరవాడ: వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రచారంలో జోరు పెంచారు. కలపాక, నాయుడుపాలెం గ్రామాల్లో ఆ పార్టీ నాయకులు విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలని అభ్యర్థిస్తున్నారు. కలపాక సర్పంచ్ బొండా కనకారావు, నాయుడుపాలెం సర్పంచ్ కూండ్రపు వరలక్ష్మి సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.

93వ వార్డులో..

సింహాచలం: జీవీఎంసీ 93వ వార్డు పరిధిలోని విరాట్‌నగర్, మారుతినగర్‌లో మంగళవారం సాయంత్రం వైఎస్సార్‌సీపీ పెందుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి అన్నంరెడ్డి అజయ్‌రాజ్,93వ వార్డు ఇన్‌చార్జి దాసరి అన్నపూర్ణ తదితరులు ఇంటింటి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మే 13న జరిగే సార్వత్రిక ఎనికల్లో వైఎస్సార్‌సీపీ పెందుర్తి ఎమ్మెల్యే అభ్యర్థి అన్నంరెడ్డి అదీప్‌రాజ్, అనకాపల్లి ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడును భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో 93వ వార్డు నాయకులు దాసరి సత్తిబాబు, బండి సత్తిబాబు, రమేష్, అడ్డాల రామరాజు, శ్రీకాంత్, వెంకటేష్, కనకరాజు, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.



93వవార్డులో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు అజయ్‌రాజ్, ఇన్‌చార్జి దాసరి అన్నపూర్ణ తదితరులు

జోరుగా అభ్యర్థుల ప్రచారం

పెందుర్తి: పెందుర్తి అసెంబ్లీ నియోజక వర్గంలో బరిలో ఉన్న పలువురు అభ్యర్థులు మంగళవారం జోరుగా ప్రచారం చేశారు. సబ్బవరం, పెందుర్తి, పరవాడ ప్రాంతాల్లో తమకు ఓటేయాలని ప్రజలను విజ్ఞప్తి చేశారు. పిరమిడ్ పార్టీ అభ్యర్థి ఈతరోజా ఫ్లూట్ గుర్తుపై, సమాజ్‌వాది పార్టీ అభ్యర్థి మురళీ మోహన్ సైకిల్ గుర్తుపై, ఇండిపెండెంట్ అభ్యర్థి ఆడారి నాగరాజు విజిల్‌పై, గుంటూరు వెంకటనరసింహారావు రింగ్‌పై ఓటేసి గెలిపించాలని అభ్యర్థించారు.

ఘనంగా గ్రామదేవతల పండగలు



బోయమాంబను దర్శించుకున్న గ్రామ పెద్దలు

పరవాడ: మండలంలోని పెదముషిడివాడ, పి.బోనంగి, తిక్కవానిపాలెం గ్రామాల్లో పైడిమాంబ, బోయమాంబ, ఏడు అమ్మవార్ల పండగలను ఆయా గ్రామాల ప్రజలు మంగళవారం అట్టహాసంగా నిర్వహించారు. పెదముషిడివాడ గ్రామంలో కొలువుదీరిన పైడిమాంబ అమ్మవారిని గ్రామ సర్పంచ్ పల్లా నాగమణి, ఎంపీటీసీ ఒమ్మి వెంకటరావు దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. వేలాదిగా తరలివచ్చిన భక్తులు అమ్మవారికి పసుపు కుంకుమలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. డప్పు వాయిద్యాలు, చిడతలు, తప్పెటగుళ్లు, కోలాటాలతో అమ్మవారిని పురవీధుల్లో ఊరేగించారు. పండగ సందర్భంగా ఏర్పాటు చేసిన గుర్రం పందాల్లో విజేతలకు ఆలయ కమిటీ చైర్మన్ కబడ్డి అప్పారావు నగదు బహుమతులు అందజేశారు. ఆలయ ప్రాంగణంలో అన్నప్రసాద వితరణ చేశారు. గ్రామ పురవీధుల్లో మంగళవారం రాత్రి నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. రాత్రికి భారీ బాణ సంచాకాల్పులతో అమ్మవారి అనుపు మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు.

- పి.బోనంగి గ్రామ ప్రజలు ఆరాధ్యదైవమైన బోయమాంబ అమ్మవారి పండగను ఘనంగా నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకొని పూజలు జరిపి మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామ సర్పంచ్ బండారు కల్పనరాజశేఖర్, మాజీ ఎంపీటీసీ డెక్క శ్రీనివాసరావు, వైస్ సర్పంచ్ రాము అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు.ఆలయ ప్రాంగణంలో భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు. డప్పువాయిద్యాల నడుమ అమ్మవారి అనుపు నిర్వహించారు.
- తిక్కవానిపాలెం మత్స్యకారుల ఆరాధ్య దైవం ఏడు అమ్మవార్ల పండగను ఘనంగా జరుపుకున్నారు. మత్స్యకారులు అమ్మవార్లను దర్శించుకొని పూజలు చేశారు. రాత్రికి అంగరంగ వైభవంగా అనుపు ఉత్సవం నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో గంగాదేవి పండగ



అమ్మవారిని దర్శించుకుంటున్న సర్పంచ్ నారాయణమూర్తి,వైస్ ఎంపీపీ గోవింద్

సబ్బవరం: మండలంలోని అంతకాపల్లి శివారు ఒమ్మివానిపాలెంలో మంగళవారం గంగాదేవి పండగను కనుల పండువగా నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు.అంతకాపల్లి సర్పంచ్ సబ్బవరపు నారాయణమూర్తి,వైస్ ఎంపీపీ చొక్కాకుల గోవింద్, మాజీ సర్పంచ్ సబ్బవరపు దేముడు బాబు,ఉప సర్పంచ్ గొర్లి అప్పారావు,సబ్బవరపు శ్రీనివాసరావు,ఒమ్మి కోటి,పల్లా రమణ అమ్మవారిని దర్శించుకున్న వారిలో ఉన్నారు.

ఆదిరెడ్డి పాలెంలో..

సబ్బవరం: సబ్బవరం మేజర్ పంచాయతీ పరిధిలోని ఆదిరెడ్డిపాలెం వాసుల ఆరాధ్యదైవం శ్రీపరదేశిమాంబ పండగను మంగళవారం వైభవంగా నిర్వహించారు. భక్తులు అమ్మవారికి దూపదీప నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. రాత్రికి అమ్మవారి అనుపు మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మాజీ జెడ్పీటీసీ సభ్యుడు కొటాన రాము, ఎంపీటీసీ బైలపూడి దేముడుబాబు,మాజీ వైస్ ఎంపీపీ కొటాన కోటయ్య, ఆదిరెడ్డి రమణ, గొంప దేముడు,బైలపూడి సత్యం తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు.

ఏయూ ఇంజినీరింగ్ కళాశాల ఆదర్శంగా నిలవాలి



ప్రసంగిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాలను ఆదర్శంగా తీర్చిదిద్దాలని వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి అన్నారు. మంగళవారం ఉదయం ఏయూ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ కార్యాలయంలో విభాగాధిపతులతో ఆయన సమావేశమయ్యారు. ముందుగా ఏయూ ఇంజినీరింగ్ కళాశాలకు స్వయం ప్రతిపత్తి హోదా పునరుద్ధరించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. విభాగాధిపతులు, ఆచార్యులు, సిబ్బంది సహకారంతో ఇది సాకారమైందని చెప్పారు. రానున్న ఏడాది కాలంలో నిర్వహించాల్సిన పలు లక్ష్యాలపై దిశానిర్దేశం చేశారు. అటానమస్ హోదా పునరుద్ధరణ ఫలితంగా నూతన మార్గదర్శకాలు అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి విభాగం, ఆచార్యులు పలు లక్ష్యాలను ఏర్పాటు చేసుకుని వ్యక్తిగత, కళాశాల ఉన్నతికి పాటుపడాలని వీసీ సూచించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య జి.శశిభూషణరావు, ఆచార్యులు పాల్గొన్నారు.